



www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 01 | మే | 2025 పేజీలు 8

# తీరు మారిన శ్రమ దోపిడీ



## -మోడీ పాలనలో హక్కుల హననం
## -వేళ్లూనుకుంటున్న నిర్బంధం -నేడు 139వ మేడే

**ప్రజాపక్షం/ఖమ్మం :** పని భారం తగ్గించుకునేందుకు కార్మిక లోకం అనేక పోరాటాలను చేసింది. సహచరులు నేలకు ఒరుగుతున్న, నిర్బంధాలు ఎదురవుతున్నా వాటిని పట్టించుకోకుండా పట్టుదలతో పోరాడి హక్కులను సాధించుకున్నారు. ఎనిమిది గంటల పని కోసం సాగిన పోరాటం ప్రపంచ వ్యాప్తంగా అనేక కార్మిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచింది. భారతదేశంలో 1920లో ఏఐటి యుసి ఆవిర్భావం తర్వాత కార్మిక వర్గం హక్కుల కోసం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా అనేక చారిత్రిక పోరాటాలను నిర్వహించింది. సంఘటిత పోరాటాలకు అనేక విజయాలను అందుకున్నారు, హక్కులు సాధించుకున్నారు. ప్రస్తుత భారతదేశ కార్మిక వర్గం అనుభవిస్తున్న హక్కులలో ఏ ఒక్కటి పోరాటం లేకుండా దక్కలేదంటే అతిశయోక్తి కాదు. హక్కుల సాధన వెనుక అనన్య త్యాగాలు, బలిదానాలు దాగి ఉన్నాయి. కార్మిక పోరాటాలను సహించలేని యాజమాన్యాలు నియంతృత్వ ధోరణితో అణిచివేతకు పూనుకోవడంతో పాటు సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులపై నిర్బంధకాండ కొనసాగింది. 139వ మేడే సందర్భంగా పరిస్థితులను సమీక్షించుకుంటే హక్కుల హననం జరుగుతుంది. ప్రజాస్వామిక దేశంలో సైతం కార్మిక వర్గం పట్ల కక్షసాధింపు

మిగతా 2లో..

## పది ఫలితాల్లో
### 21వ స్థానంలో ఖమ్మం.. 27వ స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం

-ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు

2లో..








# వేతనాలు ఇవ్వండి.. లేదంటే ఆందోళన తప్పదు



## -ఈజిఎస్ ఉద్యోగుల హెచ్చరిక
## -మూడు నెలలుగా అందని వేతనాలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పేస్కేల్ అమలు చేయమని పోరాడాం. పేస్కేల్ సంగతి పక్కన పెట్టి మూడు నెలలుగా వేతనాలే ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన బాటపడతామని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు హెచ్చరించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. గత సంవత్సర కాలం నుండి వేతనాలు మూడు నాలుగు నెలలకు ఒకసారి వస్తున్నాయని మూడు నెలల వేతనం ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని ఉద్యోగులు తెలిపారు. ఎవరో ఒకరు చనిపోతేనే వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉందని గతంలో జనగాంలో ఒక ఈసి చనిపోతే వేతనాలు విడుదల చేశారని వారు అధికారులకు ఇచ్చిన

మిగతా 2లో..






# వలస వాదులకే పెత్తనమా..?



## -కాంగ్రెస్ సమావేశంలో నేతలను నిలదీసిన కార్యకర్తలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్టీలు మారుతూ వలస వచ్చిన వారికే పెత్తనం అప్పగిస్తే కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల సంగతేమిటని నేతలను నిలదీశారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పెత్తనం చేసిన వారే ఇప్పుడు కూడా పెత్తనం చెలాయిస్తున్నారని కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక దశాబ్దాల పాటు కాంగ్రెస్ జెండా మోస్తున్నామని కాని తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని అభివృద్ధి కార్యక్రమాల్లో తమను భాగస్వాములను చేయడం లేదని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ జిల్లా స్థాయి సమావేశం బుధవారం

మిగతా 2లో..




# తీరు మారిన శ్రమ దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)
పెరిగింది. అదే సమయంలో శ్రమ దోపిడీ పెరిగింది. కాకపోతే తన తీరును మార్చుకుంది. పెరిగిన నిరుద్యోగం, అడుగంటుతున్న ఆర్థిక వనరులు శ్రమ దోపిడీకి కారణమవుతున్నాయి. ఒక్క ఉద్యోగానికి పిలుపునిస్తే వేల మంది అన్ని అర్హతలు ఉన్న వారు హాజరవుతున్న నేపథ్యంలో యాజమాన్యాల వైఖరి మారింది. ఒకరు పోతే ఏమిటి నలుగురు వస్తారనే ధోరణి పెరిగి పోయింది. దీనితో కార్మికులలో అభద్రత భావం పెరిగింది. హక్కుల గురించి అడిగే పరిస్థితి లేదు. ఉన్న హక్కులే ఊడిపోతున్నాయి. ఇందుకు కారణం ముమ్మాటికి పాలకులే. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల ప్రధానిగా వినతికెక్కిన నరేంద్ర మోడీ పాలనలో హక్కుల హననం జరుగుతుంది. దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను కలం పోటుతో తొలగించి వేస్తున్నారు. 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చి తాను కార్మిక వ్యతిరేకినని మోడీ ప్రభుత్వం నిరూపించుకుంది. కార్పొరేట్ సంస్థలకు పన్నుల రాయితీ, బకాయిల రద్దు లాంటి కార్యక్రమాలకు పెద్దపీట వేసే కేంద్ర సర్కార్ కార్మిక సంక్షేమం కోసం రూపాయి ఖర్చు చేయాలంటే పలు ఆలోచనలు చేస్తుంది. ఇప్పటి వరకు కార్మిక సంక్షేమం కోసం లక్ష కోట్లు కూడా ఖర్చు చేయని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు చెందిన రూ. 16.53 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందంటే ఈ ప్రభుత్వం ఎవరి పక్షానో పని చేస్తుందో అవగతమవుతుంది. మరో పక్క శారీరక శ్రమ స్థానే మేధో శ్రమ పెరిగింది. మారిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యం, ఐటి రంగ విస్తరణ నేపథ్యంలో శ్రమ దోపిడీ తారా స్థాయికి చేరింది. ఐటి కంపెనీలలో ఉద్యోగాల తొలగింపుతో ఐటి ఉద్యోగుల్లో అభద్రత భావం పెరిగిపోయింది. ఉద్యోగం ఉంటే చాలు ఎంత శ్రమైనా చేద్దాం అనే భావనను కార్పొరేట్ సంస్థలు ఉద్యోగుల్లో పెంపొందించేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. వైట్ కాలర్ ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చింది. ఇక ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థల్లోనూ నిర్బంధం వేళ్లూనుకుంటుంది. కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసి సమ్మెపై ఉక్కుపాదం మోపిన ఘటన ఇంకా మరిచిపోలేదు. పాలకుల ఆలోచనల నేపథ్యంలో క్రమేపి నిర్బంధం వేళ్లూనుకుంటుంది. నోరెత్తితే అణిచివేయండి, ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగించండి, అవసరమైతే పోలీస్ కేసు పెట్టండి అనే భావన యాజమాన్యాల్లోనూ, పాలకుల్లోనూ పెరిగిపోతుంది. ప్రశ్నించేతత్వాన్ని జీర్ణించుకోలేని పాలకుల నడుమ 139వ మేడేను జరుపుకుంటున్నాం. 139 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ప్రస్తుత పరిస్థితులను గతంలోనూ కార్మిక లోకం చవిచూసింది. ఇంత కంటే నిర్బంధాలను ఎదుర్కొన్నది. కాని మారిన సామాజిక పరిస్థితులు సమరశీల పోరాటాలకు వెనకడుగు వేసేలా చేస్తున్నాయి. ఒక్క కార్మిక లోకమే కాదు విభిన్న రంగాల్లో పని చేస్తున్న వారంతా పోరాడితేనే ఆయా రంగాల పరిరక్షణ సాధ్యమవుతుంది. రైతాంగం సైతం పోరాడకుండా వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకునే పరిస్థితి లేదు. గత పోరాటాలను నెమరువేసుకుని భవిష్యత్తు పోరాటాలకు పునరంకితం కావాల్సిన సమయమిది. అరుణ పతాక నీడలో అనేక విజయాలను సాధించిన కార్మిక లోకం పెరుగుతున్న నిర్బంధం, హక్కుల హననంకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సి ఉంది. సమ్మెలు, హర్తాళ్, బంద్, ఘెరావో లాంటి పోరాట పంథాలతో ముందుకు సాగాల్సి ఉంది. పోరాటాలకు ముందుండే కార్మిక లోకం నిస్తేజంగా మారితే మరో సారి బానిసత్వం రాజ్యమేలుతుంది. ఆ విషయాన్ని గుర్తెరిగి 139వ మేడే సందర్భంగా భవిష్యత్తులో సమరశీల పోరాటాలకు పునరంకితం కావాలి. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వేచ్ఛ, హక్కులు కూడా అవసరమని గుర్తించాలి.

## పది ఫలితాల్లో
### 21వ స్థానంలో ఖమ్మం.. 27వ స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతిలో ఖమ్మంజిల్లా విద్యార్థులు 94.47 శాతం విజయంతో జిల్లాను 21వ స్థానంలో నిలిపారు. బుధవారం విడుదలైన ఫలితాలు అత్యుత్తమ ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశాయి. ఖమ్మంజిల్లా నుంచి మొత్తం 16,391 మంది విద్యార్థులకు గాను 15,485 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 94.47 శాతం ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. పదిలోనూ బాలికలే పై చేయి సాధించారు. 95.54 శాతం బాలికలు ఉత్తీర్ణులు కాగా 93.10 శాతం బాలురు ఉత్తీర్ణులయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 12,250 మంది విద్యార్థులకు గాను 11,208 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 91.49 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలో 27వ స్థానంలో నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బాలికలే పై చేయి సాధించారు. బాలికలు 93.77 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురు 89.10 శాతం విజయం సాధించారు. గురుకుల పాఠశాలలు కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు అత్యుత్తమ ఫలితాలను సాధించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిలిచాయి. పలు పాఠశాలలు నూటికి నూరు శాతం ఫలితాలను సాధించాయి.

# వలస వాదులకే పెత్తనమా..?

(మొదటిపేజీ తరువాయి)



కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య అధ్యక్షతన పాల్వంచలో జరిగింది. ఈ సమావేశానికి టిపిసిసి అబ్జర్వర్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రమోద్ లతో పాటు శాసన సభ్యులు జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు లు హాజరయ్యారు.సమావేశం ప్రారంభం కాగానే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఘర్షణకు దిగారు. అసలు తమను పట్టించుకోవడం లేదని పార్టీ మారిన వారికే ప్రాధాన్యతనిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఎంత చెప్పిన వినక పోవడంతో సమావేశం రసాభాసగా మారింది. చాలా సేపు కార్యకర్తల నిలదీత తర్వాత భవిష్యత్తులో ఇటువంటివి జరగవని నాయకులు హామీ ఇచ్చి శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండలాధ్యక్షులతోపాటు మాజీ శాసన మండలి సభ్యులు బాలసాని లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/కూసుమంచి : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీనిచ్చారు. రాష్ట్రంలోని నిరుపేదలకు వైద్య సహాయం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలో రూ.1070 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 71 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 23 లక్షల 33 వేల రూపాయలు, 35 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్షా 116 రూపాయల చొప్పున కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదవాడికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. ఆనాడు పాలించిన పాలకులు 10 సంవత్సరాలలో వైద్యం పట్ల ఎప్పుడూ మనం ఇచ్చిన నిధులు ఇవ్వలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ క్రింద సుమారు 1070 కోట్ల రూపాయలను పేదల వైద్య ఖర్చుల నిమిత్తం పంపిణీ చేశామని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున రిలీఫ్ ఫండ్ ఇవ్వడం ఇదే మొదటిసారి అని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద పేద కుటుంబానికి కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు పరిమితిని 10 లక్షలకు పెంచామని అన్నారు. పేదల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 71 మంది లబ్ధిదారులకు 23 లక్షల 33 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను, కళ్యాణలక్ష్మి పథకం క్రింద 35 మంది లబ్ధిదారులకు లక్ష 116 రూపాయల చొప్పున చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, కూసుమంచి మండల ఇంచార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## వేతనాలు ఇవ్వండి..
# లేదంటే ఆందోళన తప్పదు

(మొదటిపేజీ తరువాయి)
వినతి పత్రంలో తెలిపారు. వేతనం పై ఆధారపడి జీవించే వారు కావడంతో నెలవారి ఖర్చుల కోసం అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లడానికి పెట్రోల్, ఆటో ఛార్జీలు కూడా లేని పరిస్థితుల్లో జీవిస్తున్నామని ఉన్నతాధికారులు మాత్రం మీకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారని అయిన మాకు ఇచ్చిన లక్ష్యాన్ని నెరవేర్చి వేతనాలు అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏడాది కాలం నుండి అడ్మిన్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని అవి కూడా విడుదల చేయడం లేదన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఫైలు పెట్టండి పేస్కేల్ అమలు చేస్తామని అధికారులను ఆదేశించారని అయిన ఇంత వరకు మా కోరిక నెరవేరలేదని వారు తెలిపారు. వెంటనే వేతన బకాయిలను విడుదల చేయడంతో పాటు పేస్కేల్ అమలు చేయాలని లేని పక్షంలో దశల వారీ ఆందోళనలను చేపడతామన్నారు. మే ఒకటిన పెన్‌డౌన్, షట్‌డౌన్ కార్యక్రమం చేపడతామని రెండున శాంతియుత నిరసన కార్యక్రమాలు, మూడున ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు.

# సమస్యలను పరిష్కరించాలని పాయంను కలిసిన రైతులు



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోపినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును బుధవారం మండల పరిధిలోని రాజుపేట, విఠలానగర్, పీకే వన్ సెంటర్ రైతులు, గ్రామస్తులు కలిసి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సింగరేణి ఎఫెక్ట్ ఏరియాతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మణుగూరు ఓసి ఎఫెక్ట్ ఏరియాతో ఇప్పటికే ప్రతి రోజు సింగరేణి బ్లాస్టింగ్ తో ఇల్లులు దెబ్బతిన్నాయని, గోడలు బీటలు వారి, క్రాక్‌లు వచ్చాయని, దుమ్ము, ధూళి, ఇండ్ల మీద పడడం, చెట్ల మీద పడడంతో మంచి నీరు కూడా కాలుష్యం అయిపోయిందని, ప్రతి రోజు గ్రామాలలో ఏదో ఒక సమస్యతో వ్యక్తి ప్రజల రోగాల బారిన పడి ఆసుపత్రిలో పాలవుతున్నారని, ఈ ఏరియాలలో సింగరేణి కోసం భూములు ఇచ్చే రైతుల ఇల్లు కూడా ఉన్నాయని, కేవలం 50 మీటర్ల దూరం నుండే మా గ్రామ పక్క నుంచి సింగరేణి ఎఫెక్ట్ జరుగుతుందని, ఇంత దగ్గరగా బ్లాస్టింగ్ జరిగితే ఈ గ్రామాలలో మేము ఎలా జీవించాలని వారు అన్నారు. కావున తమరు సంబంధిత కలెక్టర్, అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మాకు కూడా పరిహారం ఇప్పించి, మమ్మల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి, మమ్మల్ని కూడా ఆదుకోగలరని, మాకు న్యాయం చేయగలరని సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, ఏఐటియుసి మణుగూరు మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, రాజుపేట ,విఠలారావు నగర్ గ్రామస్తులు బియ్యతన బోయిన వెంకన్న, బొజ్జ సదానందం, శ్రీకాకుళం వీరమల్లు, రాజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పాయంను కలిసిన నూతన తహశీల్దార్

నూతన బాధ్యతలు స్వీకరించిన ఇమ్మానియేల్ బుధవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పూల గుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పాయం నూతన తహశీల్దార్‌కి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

## వరి రైతులను ఆదుకోవాలని మంత్రికి వినతి

ప్రజాపక్షం/కూసుమంచి : వరి పండించిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సిపిఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం నాయకులు కోరారు. బుధవారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంకు వచ్చిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని రైతు సంఘం నాయకులు కలిసి వినతి చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ, కూసుమంచి మండలంలో ఈ సంవత్సరం యాసంగి పంటగా 16 వేల ఎకరాల్లో వరి పండించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పగా సన్న వడ్లను పండించాలని రైతులు ఎకరాకి ముప్పు 40 బస్తాల వరకు పంటను పండించారని, అట్టి పంటను రైతులు అనేక కష్టాలు పడి ఆరబెట్టి ఐకెపి ద్వారా ప్రభుత్వానికి అమ్ముటకు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి వడ్లను సక్రమంగా కాటాలేయకుండా లారీలు లేవని, బస్తాలు లేవని రైతుల్ని తీవ్ర ఇబ్బందులు పాలు చేస్తున్నారని, కొనుగోలు ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. ఈ రోజు కూసుమంచి మండలంలో అకాల వర్షానికి వరి పంట తడిసిపోయి, దెబ్బతినేటట్లు ఉందన్నారు. పంట సరిగా ఎండ లేదని, క్వింటాకు ఆరేడు కేజీలు తరుగు తీస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటాలు అయిన వాటికి సంబంధించి బోనస్ లు కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎక్కువ మొత్తంలో లారీలు తీసుకువచ్చి రైతాంగం పండించిన వారిని వెంటనే కాంటాలు వేసి రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..**

రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ రైతు సంఘం కూసుమంచి మండల కమిటీ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేయగా, ఈ సందర్భంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, రైతులు ఎలాంటి ఇబ్బందిపడకుండా కచ్చితంగా ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీనిచ్చారు. రైతులకు ఏ ఒక్కరికి కష్టం రాకుండా చూస్తామని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తోటకూరి రాజశేఖర్, బిక్కసాని గంగాధర్ రావు, శీలం గురుమూర్తి, మల్లెపల్లి మాజీ సర్పంచ్ తాళ్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐని బలీయమైన శక్తిగా నిర్మిద్దాం..

**- సిపిఐ నేతలు మొహ్మద్ మౌలానా, దండి సురేష్**
**- నాయుడుపేట బిఆర్ఎస్ నుంచి 25కుటుంబాలు సిపిఐలో చేరిక**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐని బలీయమైన శక్తిగా నిర్మించుకుందామని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీపరిధిలోని నాయుడుపేట బిఆర్ఎస్ నుంచి 25కుటుంబాలు సిపిఐ పార్టీలో చేరాయి. తొలుత పార్టీలో చేరిన కుటుంబాలకు ఇరువురు పార్టీ జెండాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రావుల శ్రీను అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడారు...ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీ పట్ల ప్రజల్లో మంచి అభిప్రాయం ఉన్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగానే ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన ఎర్రజెండాను అండగా నిలబెడదామన్నారు. 100సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిబద్ధతగా నాటి నుంచి నిలుస్తూనే ఉందన్నారు. అంతటి గుర్తింపు కలిగిన పార్టీలో పనిచేసేందుకు చేరిన కుటుంబాలు మరింత వన్నె తీసుకురావాలన్నారు. జిల్లా సమితి తరపున విప్లవ శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రజెండా సాక్షిగా..కంటికి రెప్పలా పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. ఐక్యమత్యంగా కలిసి ముందుకు సాగుతూ గత పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, బానోత్ రాంకోటి, మండల సమితి సభ్యులు వెంపటి సురేందర్, దండి రంగారావు, వెన్నం భాస్కర్, రామిశెట్టి రమేష్, పాల్తీయా శ్రీను, బానోత్ కృష్ణ, వెంపటి రాము, పొన్నెకంటి రామకృష్ణ, దండి రమేష్, మేళ్లచెర్వు గురవయ్య, బానోత్ గద్ద నాయక్, దేవా, ఏఐవైఎఫ్ యువజన సంఘం సభ్యులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఘనపరపు ఉపేందర్, దండి రమేష్, మిరియాల నరుణ్ తేజ్, మామిడాల కిరణ్, పొన్నెకంటి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

**25కుటుంబాలు చేరిక...**

పసుపులేటి శ్రీను, పసుపులేటి లక్ష్మయ్య, పొన్నెబోయిన అంజిబాబు, దేవిశెట్టి వెంకన్న, పసుపులేటి రమేష్, పసుపులేటి కృష్ణ, పసుపులేటి సాయి, సుభాష్, పసుపులేటి హరి, పసుపులేటి ఉపేందర్, పసుపులేటి ఉదయ్‌తో కలిపి 25కుటుంబాలు సిపిఐలో చేరాయి.

# ప్రజలకు అందించిన సేవలకు ధన్యవాదాలు

**-ప్రస్థానం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దశాబ్దాల కాలంగా ప్రజలకు నిర్విరామంగా వివిధ దశలలో సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏప్రిల్ నెలలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పదవి విరమణ పొందుతున్న 18 మంది ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ప్రస్థానం కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డా॥ జి. పద్మావతి, ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్ కె. దమయంతి, ఆర్అండ్‌బి ఈఈ సత్తుపల్లి కార్యాలయంలో అసిస్టెంట్ టెక్నికల్ అధికారి జి. వెంకటేశ్వరరావు, మంచుకొండ పిహెచ్‌సి ల్యాబ్ టెక్నికల్ గ్రేడ్ 2 అధికారి మహ్మద్ ఖాజా మునిరుద్దీన్, పెద్దగోపతి పిహెచ్‌సి ఎంపిహెచ్ఎస్ పారుపల్లి సుజాత, వైరా ఏరియా ఆసుపత్రి జూనియర్ అసిస్టెంట్ ఎ. శ్యామ్ లాల్, ఖమ్మం ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్. అంతోనమ్మ, ఖమ్మంజిల్లా ప్రజాపరిషత్ నందు సేవక్ గా పనిచేస్తున్న మహ్మద్ అబ్దుల్ గని, ముదిగొండ ఎంపిడివో కార్యాలయంలో ఓఎస్‌గా పనిచేస్తున్న మహ్మద్ యూసఫ్, ఏన్కూరు ఎంపిడివోగా పనిచేస్తున్న ఎస్. రమేష్, మధిర ఎంపిపి కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, సత్తుపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న యోగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఈ. సోమశేఖరశర్మ, గిరిజన శాఖలో ఉసిరికాయలపల్లి ఏహెచ్ఎస్‌లో పనిచేస్తున్న ఎస్. నాగేశ్వరరావు, తిరుమలాయపాలెంలో కుక్‌గా పనిచేస్తున్న బానోత్ బాబీ, పశు సంవర్ధక శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. వెంకట నారాయణ, సత్తుపల్లి సిడిపివో కనకదుర్గ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పదవి విరమణ పొందుతున్న ఉద్యోగుల ప్రస్థానం వివరాలను ఆరా తీశారు. ఉద్యోగం రాక ముందు ఏమి చేశారు, ఉద్యోగం ఎలా వచ్చింది, ఎక్కడెక్కడ చేశారు, విధి నిర్వహణలో సాధించిన ఘనతలు, జ్ఞాపకలు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. దశాబ్ద కాలంగా ప్రజలకు సేవలందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో మంచి మార్పు తీసుకు వచ్చారని పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేశారని కలెక్టర్ తెలిపారు. ఖమ్మంజిల్లా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన మార్పు తీసుకువచ్చేందుకు జిల్లా విద్యాశాఖాధికారి బాగా పనిచేశారని కలెక్టర్ ప్రశంసించారు. ప్రతి నెల పదవి విరమణ పొందే సిబ్బందికి మన జిల్లాలో ఘనంగా వీడ్కోలు పలకడంతో పాటు వారి అనుభవాలను ముందు తరాల సిబ్బందికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన ఉద్యోగులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షా రైనా, డిడి సోషల్ వెల్ఫేర్ కె. సత్యనారాయణ, డివైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, కలెక్టరేట్ ఏవో అరుణ, సీనియర్ అసిస్టెంట్ వెంకన్న, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి గ్రామాలపై దాడులను నిలిపి వేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఆపరేషన్ క ఘర్ పేరుతో ఆదివాసి గ్రామాలపై ప్రజలపై కేంద్ర ప్రభుత్వదాడులను హత్యాకాండను నిలిపివేయాలని ఆదివాసి ట్రైబల్ ఫోరం రాష్ట్ర నాయకులు అలెమ్ గురువయ్య అన్నారు. బుధవారం కారేపల్లి మండలం వేపల్లి గ్రామంలో ఆదివాసి గిరిజన ట్రైబల్ ఫోరం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత 15 రోజుల నుండి రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా కర్రెగుట్ట ప్రాంతంలో 15వేల మంది సైనిక బలగాలతో ఏకపక్ష దాడులు నిర్బంధాలు హత్యలు ఎన్కౌంటర్లను నిలిపివేయాలని, ఇప్పటికే వందలాది మంది అమాయక ఆదివాసి గిరిజన ప్రజానీకం గ్రామాలను వదిలి తిండి లేక రక్షణ లేక బిక్కుబిక్కు అనుకుంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెలదీస్తున్నారని అన్నారు. చత్తీస్‌ఘడ్ తెలంగాణ రాష్ట్ర సరిహద్దు కర్రెగుట్టలపై చుట్టూ మోహరించి ఉన్న కేంద్ర ప్రభుత్వ సైనిక భద్రత దళాలను వెంటనే నిలిపివేసి శాంతిని నెలకొల్పాలని ఆదివాసి గిరిజన ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆదివాసి గిరిజన ట్రైబల్ ఫోరం నాయకులు అలెమ్ చంద్రయ్య, సమ్మయ్య, దానసరి శ్రీను, వెంకన్న, కోటయ్య, నాగేశ్వరరావు, మంగమ్మ, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంగళవారం విడుదల చేసిన పది ఫలితాలలో సత్తాచాటారు. ఏదులాపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు ధనియాకులు స్ఫూర్తి 552, చక్రాల శ్రీనిత్య 546, కొట్టె లాస్యశ్రీ 515మార్కులు సాధించారు. వీరిని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే జిల్లాపరిషత్ జలగంనగర్ విద్యార్థులు 81.8శాతం, జిల్లాపరిషత్ మంగళగూడెం 92శాతం, జిల్లాపరిషత్ ఏదులాపురం 97.5శాతం, జిల్లాపరిషత్ వెంకటగిరి 94.7శాతం,కేజీబీవి 98శాతం, జిల్లాపరిషత్ ఎంపీ,పాలెం 82.35శాతం, జిల్లాపరిషత్ ముత్తగూడెం 91శాతం, జిల్లాపరిషత్ గోళ్లపాడుపోలేపల్లి 86శాతం, జిల్లాపరిషత్ గుదిమళ్ల 77శాతం, జిల్లా పరిషత్ ఆరెంపుల, జిల్లా పరిషత్ కొండాపురం 100శాతం, జిల్లాపరిషత్ తెల్దారుపల్లి 63శాతం, జిల్లాపరిషత్ తల్లంపాడు 75శాతం, జిల్లాపరిషత్ చింతపల్లి 78శాతంతో కలిపి మొత్తం 85శాతం ఉత్తీర్ణతను సాధించాయి. మొత్తం 461మందికి గాను 392మంది విద్యార్థులు పాస్ కాగా..69మంది ఫేల్ అయ్యారు. వీరిలో జిల్లా పరిషత్ జలగంనగర్‌కు చెందిన పి. వెన్నెల 581తో ప్రథమస్థానం, జిల్లాపరిషత్ మంగళగూడెంకు చెందిన కే.వరుణ్‌తేజ్ 561తో ద్వితీయస్థానం సాధించి మండల టాపర్లుగా నిలిచారు. వీరిని ఎంఈఓ మూడ్ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

# పది ఫలితాల్లో భరత్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన భరత్ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు అధినేత శీలం విద్యాలత వెంకటరెడ్డి తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు శీలం రాజశేఖర్ రెడ్డి, సత్య భార్గవ్ రెడ్డి 579, చలువాది శైలేష్ 578, నరెడ్ల దేవా హర్షరెడ్డి 577, రావిరాల కృతిక 574, ఇప్పట మోక్షజ 570 మార్కులు రాగా 20మందికి పైగా 550మార్కులు, 45మంది 500మార్కులు సాధించి నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వారితో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జింకె కోటేశ్వరరావు, ఉమా, డీన్, రవీందర్‌రెడ్డి, స్రవంతి, నాగరాజు, అజీమ్, ప్రసాద్, పాషా, త్రివేణి, భవాని పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో సెయింట్ ఫ్రాన్సిస్ విజయ కేతనం




**ప్రజాపక్షం/ మధిర :** బుధవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజయకేతనం ఎగురవేశారు. పదవ తరగతి విద్యార్థిని సిహెచ్ సంజన 600మార్కులకు గాను 570, ఎం.అమూల్య 569, కె.హరిదీప్ 568, టి. వర్షిక 566, ఎం.ప్రణీత 554మార్కులు సాధించినట్లు సిస్టర్ ఆన్‌బేబి తెలిపారు. అదేవిధంగా పదవతరగతిలో నూటికి నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమెతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

# ధాన్య రైతులు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యం పండించిన రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడిఏ విజయచంద్ర తెలిపారు. మధిర మండలంలోని మడుపల్లి ఐకెపి సెంటర్‌లో రైతులు ఆరబోసిన వరిధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమశాతం 17శాతంలోపే ఉండాలని, ఇతర నాణ్యత ప్రమాణాలను పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. గ్రేడ్ ఎ సన్నరకం రూ.2320, దొడ్డు రకం 2300 మద్దతు ధరతో పాటు సన్నరకానికి తెలంగాణ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ అమృత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ తల్లాడ :** బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. మండలస్థాయిలో షేక్.ఆసిఫ్ 561, పి.వేణు 536 మార్కులు సాధించినట్లు హెచ్ఎం నర్సింహారావు తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో మొత్తం 90శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి జిల్లాస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయనతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## పదిలో హార్వెస్ట్‌కు ఉత్తమ ఫలితాలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి (ఎస్ఎస్‌సి) ఫలితాల్లో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి అగ్రశ్రేణిలో నిలిచారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజ మాన్యం తెలిపింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థిని ఎస్‌కె మాహిజూహ 600 మార్కులకు గాను 569 మార్కులు, జి. జ్యోత్స్న 565, జి. సుభాష్ చంద్ర 564, కె. జస్విత 561, డి. వేదర్ష 558, ఎ. మౌక్తిక 557, జే. సంపత్‌కుమార్ 557 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. 59 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని, తెలుగులో 15 మంది, హిందీలో 54, ఇంగ్లీష్‌లో 49, గణితంలో 26, సైన్స్‌లో 29 మంది, సోషల్‌లో 29 మంది విద్యార్థులు ఎ1 గ్రేడ్లు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి లు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామని ఇందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు, విద్యార్థుల శ్రమే కారణమని బేబీమూన్ హైస్కూల్ కరస్పాండెంట్ కేసా వీరన్న తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలను సాధించామన్నారు. ప్రణాళికాబద్ధంగా నైపుణ్యం కలిగిన, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో బోధన సాగిస్తున్నామన్నారు. విద్యాబోధనలోనే కాకుండా క్రీడలు, సాహిత్యం, కళా రంగాలకు సంబంధించి కూడా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామన్నారు. పాఠశాలకు చెందిన హాస్య ప్రియ 555, శాంతి శరణ్య 554, నక్షత్ర 552 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఇందుకు కారణమైన ప్రతి ఒక్కరికి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కేసా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పదిలో సత్తా చాటిన బిబిఎం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో బిబిఎం విద్యార్థులు విజయకేతనం ఎగుర వేసినట్లు పాఠశాల డైరెక్టర్ జి. కాంతారావు, కరస్పాండెంట్ జి.నాగమణి లు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో నాయుడుపేటలోని బిబిఎం పాఠశాల విద్యార్థులు 600 మార్కులకు గాను వై. సంజిత 583, ఎం. సుధీర్ 581, డి. మీనాసాహితి 570, బి. నిహారిక ధన్యశ్రీ 566, పి. భువితేజ 565, జి. ఉపజ్ఞ 564, వై. కుసుమశ్రీ, ఎస్. దుర్గాప్రసాద్ 563, డి. సింధుజ 556, బి. జయవర్ధిని 550 మార్కులు సాధించారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరికి 500లకు పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. హాజరైన విద్యార్థులందరూ 70 శాతానికి పైగా మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వాటి సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. గోపాలరావు, ఉపేందర్, మీరా, సైదిరెడ్డి, స్వప్న, పద్మశ్రీ, భారతి, అనిత పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో సింగరాయపాలెం పాఠశాల ప్రభంజనం





ప్రజాపక్షం/కొణిజర్ల : పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మండలపరిధిలోని సింగరాయపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రభంజనం సృష్టించింది. సింగరాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదివి మండలం టాపర్‌గా ర్యాంకు సాధించిన గిరిజన విద్యార్థిని గుగులోత్ సంజన్ 532 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. ఆపాఠశాలలో లకావత్ విష్ణు 529 మార్కులు సాధించారు. వేము షర్మిల 524 మార్కులు సాధించింది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సింగరాయపాలెం హైస్కూల్ విద్యార్థులు 500 మార్కులు పైగా సాధించారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని గుగులోత్ సంజనను ప్రధానోపాధ్యాయుడుతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## పది ఫలితాల్లో న్యూవిజన్‌కు ఉత్తమ మార్కులు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ బుధవారం తెలిపారు.పాఠశాల విద్యార్థి ఆర్. భవ్య 589 మార్కులు సాధించి రికార్డు నెలకొల్పిందన్నారు.494 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 550కు పైగా మార్కులు 184 మంది విద్యార్థులు సాధించినట్లు ఆయన తెలిపారు. 500 నుంచి 449 మార్కుల లోపు 215 మంది విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు. తెలుగులో 119 మంది ఎ1గ్రేడ్లు, 159 ఏ2గ్రేడ్లు, హిందీలో 300 మంది ఎ1, 155 మంది ఎ2 గ్రేడ్లు, ఇంగ్లీష్‌లో 331 మంది ఎ1, 129 మంది ఎ2 గ్రేడ్లు, గణితంలో 319 మంది ఎ1, 96 ఎ2 గ్రేడ్లు, సైన్స్‌లో 239 మంది ఎ1, 181 ఎ2 గ్రేడ్లు, సోషల్ 222 మంది ఎ1, 174 మంది ఎ2 గ్రేడ్లు సాధించారన్నారు.ఉత్తమ ఫలితాలు సాధించినవిద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు సిహెచ్ కార్తీక్, సిహెచ్ గోపిచంద్, ప్రిన్సిపాల్ ఎండి అబాద్ అలీ, జేవి మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో సత్తా చాటిన రెజొనెన్స్




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి (ఎస్ఎస్‌సి) ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాల సత్తా చాటింది. బుధవారం విడుదల చేసిన ఎస్ఎస్‌సి ఫలితాల్లో శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన ఎండి సమయ ఫిర్దౌస్ 600 మార్కులకు 578, డి. రుష్విని 577, డి. ప్రతిభ 575. కె. గాయత్రి తన్విష 574, ఎస్‌కె అష్రఫ్ 573, డి. శ్రీవల్లి 573, సిహెచ్ హాసిని 572. కె. ప్రణవ్ 571 మార్కులు సాధించినట్లు పాఠశాల యజమాన్యం తెలిపింది. 550కు పైగా మార్కులు 15 మంది విద్యార్థులు, 540కు పైగా మార్కులు 28 మంది, 520కు పైగా మార్కులు 40 మంది, 500లకు పైగా మార్కులు 57 మంది విద్యార్థులు సాధించినట్లు వారు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు అభినందించారు. రెజొనెన్స్ పాఠశాల మంచి ప్రణాళికతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తుతో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బోధన అందిస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే రెజొనెన్స్ శ్రీనగర్ లక్ష్యమని వారు తెలిపారు. నూతన ఆవిష్కరణలకు రెజొనెన్స్ విద్యార్థులు ఎల్లప్పుడు ముందుంటారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో త్రివేణి విజయ దుందుబి




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి (ఎస్ఎస్‌సి) ఫలితాల్లో త్రివేణి టాలెంట్ స్కూల్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయ దుందుభి మ్రోగించినట్లు త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డా॥ గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో త్రివేణి అన్ని బ్రాంచ్‌లలో గల తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి టాప్ ప్లేస్‌లో నిలిచారన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 600 మార్కులకు గాను 593, 590, 587, 587, 587, 586, 586, 586, 584, 583, 583, 583, 582, 582, 581, 581, 581, 581, 580, 580, 580 వంటి టాప్ మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 570కు పైగా మార్కులు 61 మంది విద్యార్థులు, 550 మార్కులకు పైగా 200 మంది విద్యార్థులు, 500 మార్కులకు పైగా 686 మంది విద్యార్థులు సాధించినట్లు ఆయన తెలిపారు. గతంలో గ్రేడుల విధానంలో, నేడు మార్కులలోనూ త్రివేణి పాఠశాలకు తిరుగు లేదన్నారు. అత్యధిక బ్రాంచీలలో వంద శాతం పాస్ పర్సంటేజ్‌తో తెలంగాణలోనే త్రివేణి నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. ఎస్ఎస్‌సిలో ఉత్తమ ఫలితాల సాధనకే పరిమితం కాకుండా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఐఐటి, నీట్, జెఇఎస్‌వో , ఎన్‌టిఎస్ఈ, ఒలంపియాడ్ వంటి పోటీ పరీక్షల్లో కూడా విజయం సాధించేలా విద్యార్థులకు పటిష్ట పునాది ఏర్పరుస్తున్నామన్నారు. ఇన్ని విజయాలకు కారణం మారే తరానికి, మారే విద్యా విధానాలకు అనుగుణంగా నేటి పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యా ప్రణాళికలు రూపొందించి దానికి అనుగుణంగా విద్యను అందిస్తున్నామని ఆయన తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం, కొత్తగూడెం లో గల తమ బ్రాంచ్‌ల నుండి ఎస్ఎస్‌సిలో విజయం సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఖమ్మం త్రివేణి పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## పది ఫలితాల్లో సత్తా చాటిన గీతాంజలి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల గీతాంజలి విద్యానికేతన్ తన జైత్రయాత్రను కొనసాగించింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో డి. బిందుప్రియ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి అగ్రభాగాన నిలిచింది. పి. ఫణీంద్ర 574, పి. ఉజ్వల 570, జి. వేదశ్రీ 566, ఎన్. దీపిక 563, మణికంఠ 557, డి. నామసహస్ర 556, సిహెచ్ జ్యోత్స్న 551, ఎస్. జోషిత్ సాయివర్మ 550, సిహెచ్ సౌజన్య 550 మార్కులు సాధించారు.హాజరైన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. 550కు పైగా పది మంది, 500లకు పైగా 31 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ టివి అప్పారావు, డైరెక్టర్లు టి. పద్మ, టి. అరుణ్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## పదిలో సత్తా చాటిన రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాల




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఖమ్మం వీడియోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటినట్లు పాఠశాల డైరెక్టర్లు నీలిమ, ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన జి. జ్ఞానదీప్తి, జి. జస్విత 600 మార్కులకు 578 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. సిహెచ్ వెంకటసాయి శబరి 571, డి. రుత్విక 563, డి. ఉదయశ్రీ 562, అయేషా, ఠాగూర్ 561, లోకేష్ 560, వినీష్ 558, సాయితేజ, మోక్ష 554, అక్షిత్ చౌదరి 553, శ్రీవల్లి 551, సాద్వితేజ, రమ్య 548, మీర్జా 546, ఎ. చైతన్య 543, కె. తాప్సీప్రియ 534, జి. నరేష్, పృథ్వీ 533, వి. సాత్విక్ 531 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. ప్రతి ఇద్దరిలో ఒక విద్యార్థి 500 మార్కులతో నూరు శాతం ఫలితాలు సాధించినట్లు డైరెక్టర్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టులోనూ నూరు శాతం మార్కులు పలువురు విద్యార్థులు సాధించినట్లు వారు తెలిపారు. చక్కటి ప్రణాళికతో విద్యాబోధన అందించడం వల్లే ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించగలిగామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను డైరెక్టర్లు అభినందించారు.

## పది ఫలితాల్లో తెలంగాణ శ్రీచైతన్య ప్రభంజనం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఖమ్మం శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి ప్రభంజనం సృష్టించారని తెలంగాణ శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య లు తెలిపారు. బుధవారం వెలువడిన ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థి ముత్యాల అఖిలేష్ 600 మార్కులకు గాను 592 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. శ్రీమనోజ్ఞ 586, వర్ష ప్రసూన 585, విశాల్ 584, శ్రీవిద్య 583, సాయి అంజని 583, ఉమేష్‌చంద్ర, వర్షిణి, నాగశరణ్య, యశస్విని 582, అక్షయ, అక్షర, లక్ష్మి తనూజ 581, శెరిన, బాలత్రిలోక్య, అక్షయ 580 మార్కులు సాధించారన్నారు. ఐఐటి, మెడికల్ కోచింగ్‌తో పాటు స్టేట్ సిలబస్‌లో కూడా తమ పాఠశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబర్చారన్నారు. ఇటీవల ప్రకటించిన జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో తెలంగాణ శ్రీచైతన్య విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 100 లోపు ర్యాంకులు సాధించారన్నారు. చక్కటి బోధన, కరిక్యులమ్, షెడ్యూల్ ఖచ్చితంగా అమలుచేయడం వల్ల ఇలాంటి ఫలితాలు సాధించామన్నారు. పదవ తరగతిలో రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో డిజిఎం చేతన్ మథూర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్స్ శర్మ, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కెవిఆర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో సర్వజ్ఞ ప్రభంజనం




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి (ఎస్ఎస్‌సి) ఫలితాల్లో ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు అద్వితీయ ప్రతిభ కనబర్చి ప్రభంజనం సృష్టించారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో సర్వజ్ఞ పాఠశాలకు చెందిన ఆర్. వేద వందన 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. నీలిమ లు తెలిపారు. బి. తరుణ్ 580, జి. మేధాశ్రీ 569, వై. అనితర 566, పి. స్నిగ్ధ 562, డి. శుభాంగి 561 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను వారు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ కోసం సర్వజ్ఞ పాఠశాల ప్రాధాన్యత నిస్తుందని విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. తమ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సంగీతం, ఆటపాటలు వంటి విభాగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఐఐటి ఫౌండేషన్ తో తమ పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటి మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎస్‌బిఐటి కళాశాలలో అటానమస్ బ్యాచ్‌కు సంబంధించిన బిటెక్, ఎంటెక్, ఎంబిఏ, ఎంసిఏ 2024 25 విద్యా సంవత్సరంకు సంబంధించి మొదటి సెమిస్టర్ ఫలితాలను బుధవారం కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి లు విడుదల చేశారు. అటానమస్ హోదా దక్కించుకున్న మొదటి ఏడాదే అద్భుత ఫలితాలు సాధించామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుండాల కృష్ణ మాట్లాడుతూ అటానమస్ హోదా సాధించడమే గాక దానికి తగ్గ ప్రత్యేక కార్యాచరణ అవలంభించడం వల్ల ఇంతటి విజయాన్ని అందుకోగలిగామన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి మాట్లాడుతూ ఈసిఈ విభాగంకు చెందిన మధుషా 10కి 10 ఎస్‌జిపిఏ సాధించినట్లు ఆమె తెలిపారు. సిఎస్ఈ (ఏఐఎంఎల్) కు చెందిన సభాఆబ్రిన్ 9.9, సిఎస్ఈ(డేటా సైన్స్)కు చెందిన ఎ. దినేష్‌కుమార్ 9.85, సిఎస్ఈకు చెందిన ఎ. కావ్యశ్రీ 9.8, ఈఈఈ కు చెందిన డి. ప్రశంస 5.65 ఎస్‌జిపిఏ సాధించినట్లు ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం అన్ని బిటెక్ కోర్సులకు గాను తమ కళాశాల 63.48 శాతం ఫలితాలు సాధించిందని ఆయన తెలిపారు. ఎంసిఏ 81.63, ఎంబిఏ 64.17, ఎంటెక్‌లో 55.56 శాతం ఉత్తీర్ణత సాధించామని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎవివి శివప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, జె. రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో విన్‌ఫీల్డ్ విజయభేరీ




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విన్‌ఫీల్డ్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించి విజయభేరీ మ్రోగించారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన బి. ఉదయ్‌కుమార్ 581, డి. నటాషా 576 మార్కులు సాధించారు. మొత్తం హాజరైన విద్యార్థులు 148 మంది ఉత్తీర్ణత సాధించారు. 500లకు పైగా మార్కులను 79 మంది, 70 శాతానికి పైగా 135 మంది విద్యార్థులు సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ లు అభినందించారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో టైనిటాట్స్ ప్రభంజనం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఖమ్మం నగరంలోని టైనిటాట్స్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ మా ర్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన కె. మురళికృష్ణ, జి. విష్ణుప్రియ 600 మార్కులకు 548మార్కులు, ఎంవి సిరిమల్లి 544, పి. టైటాస్ 531, బి. మహేష్ 524, ఎస్‌కె సిద్రాజరీన్ 522, ఎస్. షణ్ముఖసాయి 519, వి. రేవంత్ 508 మార్కులు సాధించారు. హాజరైన 37 మంది విద్యార్థుల్లో 500లకు పైగా తొమ్మిది మంది, 400లకు పైగా మార్కులతో 24 మంది విద్యార్థులు ఏ గ్రేడ్లు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ అభినందించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించినట్లు తెలిపారు.

## ఎస్ఎస్‌సిలో ఎస్ఆర్ ప్రభంజనం




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఖమ్మం ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులతో సత్తా చాటినట్లు విద్యా సంస్థల ఛైర్మన్ వరదరెడ్డి తెలిపారు. బుధవారం వెలువడిన ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థిని కల్లం పరిని 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించిందన్నారు. బాణాల రజిత 577, వి. గ్లాడియత 572, శివరాజుల మణికంఠ 571 మార్కులు సాధించారన్నారు. 20 మంది విద్యార్థులు 550, 38 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారన్నారు. అద్భుత ఫలితాలను సాధించిన విద్యార్థులను, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సిఈవో సురేందర్ రెడ్డి, సిజెడ్ఐ మనోజ్, డిజిఎం జిఎల్ఆర్, జోనల్ హెడ్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విఠ ర్‌సి మూర్తి, బి.కాంతారావు, కో ఆర్డినేటర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సిలో సెంచరీ అత్యుత్తమ ఫలితాలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎస్ఎస్‌సి ఫలితాల్లో సెంచరీ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ డివిఎస్ ప్రభాకర్‌రావు బుధవారం తెలిపారు. ఎన్.సాయితేజస్విని 600 మార్కులకు గాను 581 మార్కులు, కె. స్వాతి 573, బి. రాంచరణ్ 558, సిహెచ్ ప్రవీణ్ 557, కె. స్మరణ్ తేజ్ 555 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

# వక్ఫ్ సవరణ చట్టం అప్రజాస్వామికం

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని**



ప్రజాపక్షం/ మధిర : మైనార్టీ ముస్లిం వర్గాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం అప్రజాస్వామికమైందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమీషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ అన్నారు. మధిర మండలం దెందుకూరు రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర వే బ్రిడ్జి పక్కన ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈద్‌మిలాప్, వక్ఫ్ సవరణ చట్టంకు వ్యతిరేకంగా బుధవారం బహిరంగ సభను నిర్వహించారు. ఈసభకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత దేశ ప్రజల మధ్య మత చిచ్చు రగిలించేందకే ఈ చట్టాన్ని సవరణ చేసిందని, వక్ఫ్ సవరణ వలన ముస్లిం మైనార్టీ వర్గాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని అన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం భారతీయులకు మత స్వేచ్ఛను ప్రసాదించిందని, భారతీయులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చునని, మతాల విషయాల్లో రాజకీయ జోక్యం తగదన్నారు. నరేంద్రమోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశంలో చెప్పుకునే స్థాయిలో అభివృద్ధి సాధించలేకపోయిందని, పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు నిత్యం పెరుగుతున్నాయని అన్నారు. నిత్యవసరాలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని, వీటన్నింటిని పక్కదారి పట్టించేందుకు ఇలాంటి చట్టాలు తీసుకురావడం వాస్తవాలను ప్రజలు గమనించకుండా చేయడమే నరేంద్రమోడీ, బిజెపి ప్రభుత్వ విధానంగా మారిందన్నారు. ఇప్పటికైనా ముస్లింలకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్, సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, మందా సైదులు, బోనకల్ మండల కార్యదర్శి కిలారి సురేష్, పడకంటి మురళీ, ముస్లిం ఐక్య సంఘం బాధ్యులు, ముస్లిం సోదరులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జమాయిల్ తోట దగ్ధం



ప్రజాపక్షం/ తల్లాడ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడెకరాల జామాయిల్ తోట దగ్దమైన సంఘటన జరిగింది. మండలంలోని అన్నారు గూడెం గ్రామంలో దొడ్డ రవి అనే రైతుకు చెందిన మూడెకరాల జామాయిల్ తోట గత రెండు సంవత్సరాల క్రితం వేయడం జరిగింది. ఇంకొక్క సంవత్సరం పెరిగితే ఫలదీకరించి కర్ర కటింగ్ కొచ్చే దశ వస్తుందని, ఈతరుణంగా బుధవారం మధ్యాహ్నం పొలం పక్కనే ఉన్న 11కెవి వైర్లు లూజుగా ఉండి గాలికి కొట్టుకుని షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదవశాత్తు జామాయిల్ తోటకు నిప్పంటుకుని తోటంతా కాలిపోయిందని బాధిత రైతు తెలిపారు. అక్కడే వ్యవసాయ బావికి ఉన్న దొడ్డ శంకరయ్య, దొడ్డ శ్రీనివాసరావు రైతులకు చెందిన కరెంట్ మోటార్లు కూడా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న బిజెపి మండల నాయకులు ఆపతి వెంకటరామారావు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్దమైన జామాయిల్ తోటను సందర్శించారు. రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, సుమారు రైతులకు రూ.5లక్షల మేర నష్టం జరిగిందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు జరిగిన సంఘటనపై విచారణ జరిపించి రైతులకు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రైతులు దొడ్డ చిన్నశ్రీనివాసరావు, దొడ్డ రవి, దొడ్డ శంకరయ్య, నున్న వెంకటేశ్వర్లరావు తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భజలాలు పెరిగితేనే రాబోయే తరాలకు మనుగడ



**- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

ప్రజాపక్షం/అశ్వారావుపేట : భూగర్భజలాలు పెరిగితేనే రాబోయే తరాలకు మనుగడ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఇందిరమ్మ చెరువు బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మద్దికొండ, మొద్దులమడ, నందిపాడు, కోయ రంగాపురం, నారాయణపురం, అనంతారం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాలకు అనుసంధానంగా ఉన్న చెరువులు పంట కాలువల చెక్ డ్యామ్‌ల నిర్మాణం పునరుద్దరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా వర్షపు నీటిని సమర్థవంతగా నిల్వ చేసి రైతులకు మేలు కలిగించే లక్ష్యంతో చెరువుల మరమ్మతులు, పంట కాలువల అభివృద్ధి, నూతన చెక్ డ్యామ్‌ల నిర్మాణం నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈరోజు నీటిని ఒడిసి పడితేనే భావితరాలకు ప్రాణదాతలుగా నిలుస్తామన్నారు. భూగర్భ జలాలు అడుగంటకుండా చూసే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ డిఈఇ ఎల్.కృష్ణ, ఎఇఇ కె.ఎన్‌వి కృష్ణ, ఆర్ఐ పద్మావతి, స్పెషలాఫీసర్ స్వప్న, మండల నాయకులు జూపల్లి రమేష్, ప్రమోద్, మొగల్లు చెన్నకేశవులు, సుంకవల్లి వీరభద్రరావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# మంగమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే పాయం

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం దమ్మక్క పేట గ్రామానికి చెందిన ఏబిఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ బిల్లా సీతారాములు మాతృమూర్తి మంగమ్మ మృతిచెందగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం వారి స్వగృహానికి వెళ్లి మంగమ్మ పార్థీవదేహానికి పూలమాలవేసి, నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

**వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే పాయం ఆదేశాలు**




ప్రజాపక్షం/మణుగూరు: వర్షాకాలంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే పాయం మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజాభవన్ లో ఏడిఏ తాతారావు, నియోజకవర్గ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందించిన కార్యక్రమాలు రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతు బీమా, సన్న బియ్యానికి 500 వందలు బోనస్, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇలా అనేక విషయాలపై చర్చించారు. అదేవిధంగా నియోజకవర్గంలో అన్ని మండలాలలో ఇన్ టైంలో ఎరువులు విత్తనాలు, సీడ్ రైతులకు ఏది అవసరం అనేదానిపై ప్రత్యేక దృష్టికి పెట్టాలని, రైతులకు, వ్యవసాయ శాఖ అధికారులకు అభినవ సంబంధాలు ఉంటాయని వాటిని ఎప్పటికీ అదే విధంగా కొనసాగించాలని రైతులకు కష్టం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ స్థాయి అగ్రికల్చర్ ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ



ప్రజాపక్షం/బోనకల్: 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 472 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలు రాయగా 434 మంది ఉత్తీర్ణులు అయ్యారు. రావినూతల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని పి శ్రీవల్లి 531 మార్కులు సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ముష్టికుంట్ల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని డి విమల 527 మార్కులు సాధించి ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. అదే పాఠశాల నుంచి జె గణేష్ విద్యార్థి 507 మార్కులు సాధించి తృతీయ స్థానం దక్కించుకున్నాడు. 237 బాలురు, 235 బాలికలు పరీక్షలు రాయగా బాలురు 216, బాలికలు 218 మంది ఉత్తీర్ణులు అయ్యారు. జెడ్‌పిహెచ్‌ఎస్ బ్రాహ్మణపల్లి, ఎంజెపిఎస్ రెసిడెన్షియల్ స్కూల్‌లు 100శాతం ఫలితాలు సాధించాయి. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను మండల విద్య అధికారి దామాల పుల్లయ్య, ఆయా ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# పది ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ గురుకుల, పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. జవహర్ విద్యాలయం విద్యార్థి సాయి సంతోష్ 580మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. జెడ్పిఎస్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని యాస్మిన్ 577 మార్కులు సాధించి మండలంలో రెండవ స్థానం సాధించింది. మొత్తం 651మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి పరీక్షలకు హాజరవ్వగా వీరిలో 650మంది ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పది ఫలితాల్లో విజేతలుగా నిల్చిన విద్యార్థులు, అందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తమ పాఠశాలల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు చెప్పుతూ స్వీట్లు పంపిణీ చేశారు. మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఆయా పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించి అభినందించారు.

# చింతకాని మండల టాపర్ సోహెల్



ప్రజాపక్షం/చింతకాని : బుధవారం విడుదలైన పదవతరగతి పరీక్షా ఫలితాల్లో నాగులవంచ శ్రీగ్లోబెల్ హైస్కూల్ విద్యార్థి ఎండీ సోహెల్ 569 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. గ్లోబెల్ హైస్కూల్ విద్యార్థులు మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 31 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుర్తి దివాకర్ రెడ్డి తెలిపారు. తమ పాఠశాలలో చదువుతో పాటు క్రమశిక్షణ అందిస్తున్నామని నూర శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కీసర వాహినీ, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ తన్నీరు రామారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చింతకాని మండలంలో 94.10శాతం ఉత్తీర్ణత










ప్రజాపక్షం/చింతకాని : మండలంలో 458 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా ..431 మంది ఉత్తీర్ణులై (94.10శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు చింతకాని మండల విద్యాశాఖాధికారి ఎస్ రామారావు తెలిపారు.మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో కొదుమూరు, మత్కేపల్లి, తిమ్మినేని పాలెం, చిన్నమండవ పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రైవేటు పాఠశాలల్లో నాగులవంచ శ్రీ గ్లోబెల్, ఆదర్శ, రామకృష్ణాపురం సెయింట్ థెరిస్సా పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. నాగులవంచ శ్రీగ్లోబెల్ హైస్కూల్ విద్యార్థి ఎండీ సోహెల్ 569 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా ఆదర్శ హైస్కూల్ విద్యార్థిని బి సాయి పూజ 562 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల్లో చింతకాని హైస్కూల్ విద్యార్థి టి యమున 552 మార్కులు సాధించగా జి జ్ఞానన్య 533 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# మంత్రి పొంగులేటికి ఉద్యోగ జేఏసీ వినతి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని క్యాంప్‌కార్యాలయంలో బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పలు సమస్యలు, సలహాలను వినతి ద్వారా విన్నవించారు. దీనిపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించి, పరిష్కారం చేస్తానని హామీఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఊడుగు వెంకటేశ్వరరావు, అధ్యక్షులు ఎస్ విజయ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, గౌరవ సలహాదారులు ధరావత్ రాములు, జైపాల్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, శోభన్, కిషన్‌భద్రు, పుల్లయ్య, దేవయ్య, వీరన్న, వెంకట్, రాములు, అమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మేడేని జయప్రదం చేయండి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : 139వ ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు జరుపుకోనున్న మేడే వేడుకలను సిపిఐ శ్రేణులు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 8గంటలకు శ్రీరామ్‌నగర్‌లో బైక్‌ర్యాలీ ప్రారంభమవుతుందని, ఏదులాపురం వరంగల్‌క్రాస్‌రోడ్, తాళ్లేసితండ, చిన్నతండా, సత్యనారాయణపురంలలో జెండా ఆవిష్కరణ, ర్యాలీ జరుగుతుందన్నారు. అలాగే కామంచికల్‌లో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. కావున సిపిఐ శ్రేణులు ఎర్రచొక్క ధరించి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం ఏఐటియుసి పోరాటం

ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : సింగరేణిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదల కోసం ఏఐటీయూసీ అహర్నిశలు పోరాడుతుందని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు క్రిష్టాఫర్ లు అన్నారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ లోని సివిల్ డిపార్ట్మెంటు, బంగ్లోస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాలను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుదల కోసం చట్టబద్ధంగా రావలసిన హక్కుల సాధన కోసం కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం కోసం ఏఐటియుసి అనేక సంవత్సరాల నుండి పోరాటాలు చేస్తూ కాంట్రాక్ట్ కార్మికులకు అనేక హక్కులను సాధించి పెట్టిన చరిత్ర ఏఐటియుసి కి ఉన్నదని గుర్తు చేశారు.గత ప్రభుత్వంలో తీవ్ర అన్యాయానికి, శ్రమ దోపిడీకి,వివక్షతకు గురి అయిన కాంట్రాక్టు కార్మికులకు ప్రస్తుత ప్రభుత్వంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో, ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘం అండతో కొన్ని సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా వేతనాల పెంపుదల,ఈఎస్ఐ సాధన పై ప్రత్యేకమైన కృషి ఏఐటియుసి చేస్తుందని తెలిపారు.ఇప్పటికే కనీస వేతనాల సలహా మండలి ద్వారా కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను వెళ్లయని వాటిని ప్రభుత్వం ఆమోదించిన వెంటనే సింగరేణిలో అమలు కోసం ఏఐటియూసీ పోరాడుతుందని తెలిపారు. గుర్తింపు కార్మిక సంఘం ద్వారా సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జె.రమేష్, సతీష్, ఆదిలక్ష్మి, మణెమ్మ, చుక్కయ్య, వెంకటేశ్వర్లు, రాము, అన్వర్, విష్ణు, భాస్కర్, రాజేష్, గణేష్, సునీల్, లచ్చు, సంపత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.




# పది ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన ప్రభుత్వ పాఠశాల

ప్రజాపక్షం/సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పది ఫలితాలలో సత్తుపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకర్లపల్లి ప్రభంజనం సృష్టించింది. 56 మంది విద్యార్థులు 10 పరీక్షలకు హాజరవ్వగా, 56 మంది ఉత్తీర్ణత సాధించారు.దీంతో 100% ఫలితాలు సాధించిన పాఠశాలగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకర్లపల్లి రికార్డు సృష్టించింది. కె.ధనదుర్గ 559/600 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటింది. అంతే కాకుండా 550 పైన ముగ్గురు విద్యార్థులు, 500 పైన 19 మంది విద్యార్థులు మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి నక్కా రాజేశ్వరరావు తెలిపారు. మండల



ప్రథమ స్థానం సాధించిన వారికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ సూచనతో మాజీ వార్డ్ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు దూదిపాల రాంబాబు, మాజీ పుర వైస్ చైర్పన్ తోట సుజలా రాణిలు రూ.10116 ప్రైజ్ మనీని విద్యార్థినికి అందజేయనున్నారు. విద్యార్థిని కె.ధనదుర్గకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నక్కా రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకర్లపల్లి క్వాలిటీ ఎడ్యుకేషన్ కు నిదర్శనమన్నారు. విద్యార్థులు ఇంత మంచి ఫలితాలు సాధించడానికి చక్కటి విద్యాభ్యాసం చేసిన ఉపాధ్యాయులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# భూ భారతిపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/కామేపల్లి: భూ భారతి చట్టం చాలా మెరుగైందని ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. కామేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి ఒక్కరి అభ్యున్నతి కోసం కృషి చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. మరో ముఖ్యఅతిథిగా భూమి సునీల్ పాల్గొని మాట్లాడుతూ భూ సమస్యలకు పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భరోసా ఇచ్చారు. రైతు కమిషన్ సభ్యులు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి చట్టాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పిఏసిఎస్ కామేపల్లి అధ్యక్షులు పుచ్చకాయల సత్యనారాయణ, కొందాయిగూడెం పిఏసిఎస్ అధ్యక్షులు డి హనుమంతరావు, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబుసింగ్, మండల పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, తహసీల్దార్ సిహెచ్ సుధాకర్, ఎంపీడీవో జి రవీందర్, మండల వ్యవసాయ అధికారి బి తారాదేవి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# 139వ మేడేని జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**

ప్రజాపక్షం/సత్తుపల్లి: కార్మిక చట్టాల రక్షణకై జరిగే 139 సంవత్సరాల మేడే ఉత్సవాలకు కార్మికులు భారీగా హాజరై జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ కోరారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి గోడ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు జేవీఆర్ ఓసి, సింగరేణి కిష్టారం ఓసి, సి.హెచ్.పి, సింగరేణి కోటర్స్, సిపిఐ కార్యాలయం, లలిత కుమారి హాస్పిటల్ రోడ్డు, బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయం, ఆటో వర్కర్స్ ,ఫుట్ పాత్ వ్యాపారుల సంఘం, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, సత్తుపల్లి పట్టణంలతో పాటు అయా గ్రామాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు దండు తెలిపారు.ఈ వేడుకల్లో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని మేడే వేడుకలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.కె యాకోబు, ఉపాధ్యక్షులు శ్రీను, మురళి, నాగరాజు, షౌకత్, రమేష్, సత్యనారాయణ, కనకరావు, ప్రసాదు, శ్రీను, వెంకట్, రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వం తక్షణం స్పందించి రైతులను ఆదుకోవాలి

ప్రజాపక్షం/ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేసవికాలంలో రైతులు పండించిన ధాన్యం 1638 రకం, పిఆర్ 26 రకం ధాన్యంని మిల్లర్లు కొనుగోలు చెయ్యకుండా నిర్లక్ష్యపు ధోరణితో మిల్లర్లు రైతులతో చెలగాటం ఆడుతున్నారని సిపిఐ రాష్ట్ర నాయకులు సరాటి ప్రసాద్ ఆరోపించారు. బుధవారం ములకలపల్లిలో బాధిత రైతుల ధాన్యం రాశుల వద్దకు వెళ్లి అకాల వర్షంతో వడ్లు నీటితో తడుస్తూ నష్టపోతున్న రైతాంగ సమస్యలను తెలుసుకోగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యంను మిల్లర్లు కొనుగోలు చెయ్యకుండా తరుగు పేరుతో 10కేజీలు ఇస్తే లోడింగ్ చేస్తామని అంటున్నారని రైతులు ఆవేదన తెలియజేశారని ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే కొనే నాథుడు లేకుండా పోయారని పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా నష్టం వస్తుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. తక్షణం ప్రభుత్వం జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని జిల్లాలో 1638 రకం, పిఆర్ 26 రకం ధాన్యం కాటాలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ





ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలో పదో తరగతి ఫలితాలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మండలంలోని సింగారెడ్డి పాలెం గురుకుల బాలికల పాఠశాల లో 78 మందికి 77 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో వి.గ్రేషింత, 565, టి.సుమంత 559, ఇందు 556, వర్ష552, అన్నయ 548 మార్కులు సాధించారు. 29 మంది విద్యార్థులు 550 మార్కులు సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ యం.పద్మావతి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఆరెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 10 మందికి పది మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు అభినందనలు తెలిపారు. మండలం లో మొత్తం 456 మంది విద్యార్థులకు గాను, 421 మంది. తో 92.32 శాతం ఉతీరత సాదించారు. అందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 275 మందికి 240 మంది, 87 శాతం, గురుకుల పాఠశాల 99 శాతం, ప్రవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం విద్యార్థులు 104 మందితో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.

# పది ఫలితాల్లో బాలికలదే పైచేయి

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో పది పరీక్షలలో బాలికలదే పై చేయిగా నిలిచింది. మండలంలో ఆరు పాఠశాలలకు నుండి పదవ తరగతి పరీక్షలకు 303 మంది విద్యార్థులు హాజరు కాగా 231 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన వారు వివిధ సబ్జెక్టులలో ఫెయిలయ్యారు. తెలంగాణ గిరిజన బాలికల పాఠశాల నుండి పి రుచిత 556 మార్కులతో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. కేజీబీవీ పాఠశాల నుండి 48 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్ష వ్రాయగా 48 మంది విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎస్ చరణ్ 538 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. మండలంలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ అభినందనలను తెలియజేశారు.



# పది ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు





ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1 ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మొత్తంగా 230 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా 195 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అశ్వాపురం మండలంలో 85శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని అశ్వాపురం ఎంఈవో వీరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో తెలిపిన వివరాల ప్రకారం మండలంలో ఉన్న అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధికంగా 556 మార్కులతో విశాల్ మండల స్థాయి టాపర్గా, 549 మార్కులతో వైలోహిత మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండవ స్థానంలో, 540 మార్కులతో రేవతి అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మూడవ స్థానంలో నిలిచారని అన్నారు. మొత్తంగా మండలంలో మల్లెలమడుగు పాఠశాలలో 33మంది విద్యార్థులకు గాను 33 మంది విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారని, నెల్లిపాక బంజర స్కూల్లో 9 మంది విద్యార్థులకు గాను 8 మంది విద్యార్థులు 89శాతం ఉత్తీర్ణత సాధించారని, సీతారాంపురం స్కూల్లో 23 మంది విద్యార్థులకు గాను 20 మంది విద్యార్థులు 87శాతం ఉత్తీర్ణత సాధించారని, మిట్టగూడెం స్కూల్లో 22 మంది విద్యార్థులకు గాను 18 మంది విద్యార్థులు 82 శాతం ఉత్తీర్ణత సాధించారని, అశ్వాపురం స్కూల్లో 86మంది విద్యార్థులకు గాను 70 మంది విద్యార్థులు 81శాతం ఉత్తీర్ణత సాధించారని, గొందిగూడెం స్కూల్లో 57 మంది విద్యార్థులకు 46 మంది విద్యార్థులు 81శాతం ఉత్తీర్ణత సాధించారని అశ్వాపురం మండల టాపర్గా అశ్వాపురం హైస్కూల్‌కు చెందిన విశాల్ 556 మార్కులు సాధించారని తెలిపారు.

# పది ఫలితాల్లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాపక్షం/బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి ఫలితాలలో సారపాకలో గల బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎప్పటి లానే ప్రకటించిన ఫలితాలలో మండలంలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించి 96శాతం సాధించారు. 600 మార్కులకు గాను టీ భవ్యశ్రీ 511. ఎన్ మోహన వర ప్రసాద్ 475, రాజదీప్ రెడ్డి 471 మార్కులను సాధించి స్కూల్ టాపర్స్‌గా నిలిచారు. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్, గురు బ్రహ్మ అవార్డు గ్రహీత ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు, సహకరించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

# పది ఫలితాల్లో ప్రగతి విద్యానికేతన్ విజయకేతనం

ప్రజాపక్షం/బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాలలో సానికొమ్ము బ్రహ్మారెడ్డి సారథ్యంలో సారపాకలో గల ప్రగతి విద్యానికేతన్ విజయకేతనం ఎగరవేసింది.ఈ ఫలితాలలో పినపాక నియోజకవర్గం, భద్రాచలం నియోజకవర్గంలోని అన్ని మండలాల పదో తరగతి ఫలితాలలో బూర్గంపాడు మండలంలోని సారపాక ప్రగతి విద్యానికేతన్ ఎప్పటిలాగే విజయపరంపర కొనసాగించి, కొనసాగిస్తూనే ఉంటుందని ఈ ఫలితాలతో మరో సారి నిరూపించాయని పాఠశాల కరస్పాండెంట్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి తెలిపారు. మా పాఠశాల విద్యార్థి తూము శ్రేయాన్ తండ్రి శ్రీనివాస్ 500 మార్కులకు గాను 591 మార్కులు సాధించాడని, అదే విధంగా తాలూరి హిర కీర్తన తండ్రి రాము 561 మార్కులు, కాసర్ల గేయవర్ధిని తండ్రి వీరభద్రచారి 557, పూజల హర్షిత తండ్రి లక్ష్మ ణరావు 533, జక్కా కావ్య తండ్రి లక్ష్మీ నారాయణ 528, ఐత రాజు విష్ణువర్ధన్ తండ్రి సాయిబాబు 500 మార్కులు సాధించారు. అంతే కాకుండా నూటికి నూరు శాతం 21/21 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఈ విజయంలో కీలక పాత్ర వహించిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు సహకరించిన తల్లిదండ్రులకు ప్రోత్సహించిన శ్రేయోభిలాషులకు శుభినందనలు తెలిపారు.

# పది ఫలితాల్లో బాలికలదే పైచేయి




- జిల్లాలో 91.49 శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు
- రి కౌంటింగ్ కోసం మే 15 ఆఖరి తేది

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో బాలికలే పై చేయి సాధించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 91.49 శాతం ఉత్తీర్ణతా శాతం నమోదైంది. ఈ ఫలితాలు గత ఏడాదితో పోలిస్తే 1.10 శాతం పెరిగాయి. ఈ ఏడాది పది పరీక్షలు 12250 మంది హాజరు కాగా 11208 పాసయ్యారు. బాలికలు 6279 మందికి గానూ 5888 మంది, బాలురు 5971 మందికి గానూ 5320 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలిక కంటే బాలురు 4.67 శాతం తక్కువ ఫలితాలు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి.

**దుమ్ముగూడెం మండలంలో 98.16 శాతం ఫలితాలు...**

దుమ్ముగూడెం మండలంలో 98.16 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండల టాపర్‌గా జెడ్పిహెచ్‌ఎస్ నర్సాపురం పాఠశాలకు చెందిన శ్రావ్య 526 (తెలుగు మీడియం), పొలంచ చంద్ర హాసిని 564(ఇమీ) మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండలంలోని 9 బడుల్లో నూరు శాతంఫలితాలు రాగా మరికొన్నిట్లో ఉత్తీర్ణతా శాతం తగ్గింది.

**చర్ల మండలంలో...**

చర్ల మండలంలో 76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండలంలో 195 మంది పరీక్షలకు హాజరుకాగా, మండల టాపర్లుగా కె ఝాను 6562 మార్కులు సాధించింది. పి స్వరూప 539 సాధించడం విశేషం.

# కగార్ ఆపరేషన్‌ను నిలిపి వేయాలి

-రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపి వేసి ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని అఖిల పక్ష సమావేశం డిమాండ్ చేసింది. బుధ వారం స్థానిక మంచికంటి ఫంక్షన్ హాల్‌లో జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో పాల్గొన్న వక్తలు ఆదివా సీలపై జరుగుతున్న దాడిని నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కర్రెగుట్టల నుంచి పోలీస్ బలగాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తుందని అమాయక ఆదివాసీలపై నిర్బంధాన్ని అమలు చేస్తుందని వక్తలు ఆరోపించారు. ఈ సమావేశా నికి రవిమారుత్, స్వర్ణ భాస్కర్, కిషన్ నాయక్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా సిపిఎం జిల్లా కార్య దర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐజిల్లా నాయకులు శింగు నర్సింహారావు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వ రరావు, ఎన్డి నేత ఆవునూరి మధు, బిఆర్‌ఎస్ నాయ కులు పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, గోపగాని శంకర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్య క్షులు తొండపు వెంకటేశ్వర్లు, విద్యావేత్త ఐవి రమణా రావు, సమత శ్రీధర్, పీపుల్స్ జేఏసి కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, కార్యదర్శి చిర్రారవి పాల్గొన్నారు.

# ధాన్యం తరలించాలని రైతుల రాస్తారోకో

-తరుగు పేరుతో 5 కేజీల కోతను అరికట్టాలి
-తడిసిన ధాన్యాన్ని బేషరత్ గా కొనాలని డిమాండ్





**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని చేగొమ్మ ప్రాథమిక సహ కార పరపతి సంఘం (పిఎసిఎస్) ఆధ్వర్యంలో చింతల తండ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు రాస్తారోకో చేశారు. వివరాల్లోకొస్తే గత 25 రోజులుగా ధాన్యమును కొనుగోలు కేంద్రం కు తీసుకువచ్చిన రైతులు ఇప్పటివరకు కాటాలు వేసిన ధాన్యమును తరలించక అదేవి ధంగా బుధవారం అకాల వర్షం రావడంతో రైతులు ఒక సారి బగ్గుమ న్నారు. తమ ధాన్యం బస్తాలు తడిసిపోతున్నాయని ఇంకా కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని తూకం వేయడం లేదని రైతులకు ఒక కింటాకు లావు ధాన్యానికి ఐదు కేజీల కోత లేకుండా చూడాలని, సన్న ధాన్యానికి ఒక కేజీ కోత కూడా లేకుండా చూడాలని, ఆవేదన చెందిన రైతులందరూ ముందుగా ఏ పార్టీతో సంబంధం లేకుండా స్వచ్ఛం దంగా కూసుమంచి ఖమ్మం రహదారిపై చేగొమ్మ క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తార్పిన్ పట్టాలు ఏర్పాటు చేయాలని, ఇంకా ఎటువంటి ఆలస్యం జరగకుండా వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అధికారుల నిర్లక్ష్యం వీడి రైతులను శ్రద్ధతో పట్టించుకోని పని చేయాలని డిమాండ్ చేశారు. మరి కొంత సమయం తర్వాత రైతుల ధర్నాలను ఉద్దేశించి రైతు సంఘం నాయకులు బికసాని గంగాధర్ రాస్తారోకో వద్దకు చేరు కొని రైతులను ఉద్దేశించి తమ మద్దతు తెలిపి ప్రభుత్వం వెంటనే కొను గోలు కేంద్రాల్లో సమస్యలను ముఖ్యంగా చేగమ్మ సొసైటీ పరిధిలో రైతుల సమస్యలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తర్వాత రైతుల రాస్తారో ఒక విషయం తెలుసుకున్న కూసుమంచి ఎస్ఐ నాగ రాజు రాస్తారోకో వద్దకు వచ్చి రైతులతో మాట్లాడి సంబంధిత పై అధికా రులతో రైతులతో మాట్లాడించి రాస్తారోకోని విరమింప చేశారు అనం తరం కూసుమంచి వ్యవసాయ శాఖ అధికారి రామదుగు వాణి ఎస్ఐ నాగరాజు, వారి వారి సిబ్బందితో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సంద ర్శించి రైతుల యొక్క అభిప్రాయాలను వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడించి వారికి వీడినంత తొందరలో న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులందరూ శాంతించారు.

# గుదిమళ్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని గుదిమళ్లలో ఏదులాపురం సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. దీనిని సొసైటీ అధ్యక్షులు జర్పుల లక్ష్మ ణ్ కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ మహమూద్ ఆలీ, ఏఈఓ ఆదర్శ్, సెంటర్ ఇంచార్జ్ చంద్రయ్య, రైతులు పేరం వెంకటేశ్వర్లు, పోతునూగు రామయ్య, పటేరు వెంకటయ్య, బొల్లినేని నాగయ్య, కరిపే రామయ్య, బానోత్ సీతారాములు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో సింగరేణి మండల విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/కారేపల్లి:** పదో తరగతి ఫలితాల్లో సింగరేణి మండల విద్యార్థుల ప్రభంజనం సృష్టించారు. మండలంలోని పదవ తరగతి విద్యార్థులు మొత్తం 508కి 502 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల ఫస్ట్‌గా చాగంటి సాయి మన్వితకు 574 ప్రైవేట్ స్కూల్ జయదేవ్ మాదారం పాఠశాల సాధించారు. మండల సెకండ్ గా తెలంగాణ ఆదర్శ పాఠశాల కారేపల్లి పోలోజు యశ్వంత్ 559, మండల థర్డ్ ప్లేస్‌గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కారేపల్లి చక్రధర్ నాయక్ 533 సాధించారు. మండలం పాస్ పర్సంటేజ్ 98.81గా ఉందని మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజ్ తెలిపారు. మండలంలో ప్రథమ స్థానం, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. అదే విధంగా ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను కూడా అభినందించారు.

## పది ఫలితాల్లో అరుణోదయ ప్రభంజనం



**ప్రజాపక్షం/మణుగూరు:** పట్టణంలోని అరుణోదయ విద్యా లయం ప్రభంజన సృష్టించింది. ఈ పాఠశాలలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనపరిచి అత్యధిక మార్కులు సాధించారు. అభిషంక503/600, రమా శర్వాణి555/600, దుర్గా 553/600,శాశ్వత551/600, రష్మి క 543/600, పూజ 520/600, శ్రావ్యశ్రీ 506/600, క్తాక 505/600, మనోజ్ కుమార్503/600 మార్కులు సాధించి పాఠశాల ఘనతను సాధించిదని కారస్పాండెంట్ మాదాసు అరవింద్ కుమార్ తెలి పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

## పది ఫలితాల్లో సత్తా చాటిన కేజీవీబీ విద్యార్థినులు





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** నిరుపేద పిల్లలను సొంత పిల్లల చూసుకుంటూ వాళ్ల బంగారు భవి ష్యత్తుకు బాటలు వేస్తున్న కేజీవీబీ కళాశాల తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిరుపేద విద్యా ర్థినిలు వివిధ ప్రాంతాల నుంచి కేజీ వీబీ పాఠశాలలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి ఉత్తమ భవిష్యత్తుకు అధ్యాపక బృందం బాటలు వేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల మార్చి నెలలో నిర్వహించిన 10 తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు 30 బుధవారం విడుదల చేయగా కేజీవీబీ విద్యార్థినీలు ఉత్తమ ఫలి తాలు సాధించారని కేజీవీబీ స్పెషల్ ఆఫీసర్ రామకుమారి తెలిపారు. కేజీవీబీలో మతం 45 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతుండగా 44 మంది ఉత్తీర్ణత సాధించాలని ఆమె తెలి పారు. ఈ సంవత్సరం ప్రభుత్వం విద్యార్థినీలకు పర్సంటేజ్ కాకుండా మార్కుల రూపంలో ఫలి తాలు విడుదల చేయడంతో 600 మార్కులకు గాను బోడ అనుష 535 మార్కులు సాధించగా కే.సాత్విక 520, ఎం.ఉమాదేవి 58 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రమాకుమారి అధ్యాపక బృందం తోటి విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## శ్రీ కోమల విద్యార్థులు ప్రభంజనం

**ప్రజాపక్షం/భద్రాచలం :** విడుదలైన పదో తరగతి ఫలితాల్లో శ్రీ కోమల స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి నూరు శాతం ఉత్తీర్మతా శాతాన్ని నమోదు చేశారు. అత్యధికంగా టి రామ్ విశాల్ 600లకు గానూ 510 మార్కులు సాధించాడు. గత పదేళ్లుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉత్తమ విద్యను అందిస్తున్నట్లు కరస్పాండెంట్ పలివెల రవికుమార్ తెలిపారు. ఈ విజయంలో సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన విద్యార్థులను అభినందించారు.

## క్రాంతిలో నూరుశాతం ఫలితాలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని క్రాంతి విద్యాలయంలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చాయి. పాఠశాలకు చెందిన ఎడెర్ 562 మార్కులు సాధించారు. మొత్తం 28 మంది పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణతో మొత్తం విద్యార్థులు నిలిచారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు పాఠశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని, ఇందు కోసం ఉపాధ్యాయులుసైతం విద్యార్థుల్లో ఉన్న విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకుంటూ ఉత్త మ బోధన చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులను ఉత్తమ విద్యార్థులకు తీర్చిదిద్దేంకు క్రాంతి విద్యాలయం నిరంతరం పాటుపడుతుందన్నారు.

## గురుదేవ్ విద్యాలయంలో నూరుశాతం ఫలితాలు

**ప్రజాపక్షం/చర్ల :** మండల పరిధిలోని గురుదేవ్ విద్యాలయంలో 10వ తరగతి ఫలితాలు నూటికి నూరు శాతం ఫలితాలు పచ్చాయి. పరీక్షకు 53 మంది హాజరుకాగా మొత్తం విద్యా ర్థులు ప్రథమశ్రేణిలో పాస్ కావడం అరుదైన ఘనతగా చెప్పుకోవచ్చు. చిరంజీవి, చిన్న, దేవి, భవ్యశ్రీ 600ల మార్కులకు గానూ 557 మార్కులు, చిరంజీవి, కంచర్ల అమృత 541 మార్కులు, కరుకు చిరంజీవి, ఉదశ్రీ533 మార్కులు రాబట్టారు. 500కి పైగా మార్కులు సాధించిన విద్యా ర్థులు 12 మంది, 400లకు పైగా మార్కులు సాధించిన వారు 390 మంది, 360కి పైగా మా ర్కులు సాధించిన వారు ఇద్దరు ఉన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను, నిరం తరం తోడ్పాటు అందించిన తల్లిదండ్రులకు ప్రథానోపాధ్యాయులు, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.వి సుబ్రహ్మణ్యం, జి శ్రీనివాస్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయ బృంధం అభినందించారు.

**రాహుల్ విజ్ఞాన్ ...**

పది ఫలితాల్లోరాహుల్ విజ్ఞ్ విద్యార్థులు సత్తా చాటారు. 59 మంది పరీక్షలు రాయగా 59 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలకు నిలి చింది. లస్య లహరి 564 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించింది. వెస్లీ 545, స్నేహ543 మార్కులు సాధించారు. 500లకు పైగా మార్కులు 25 మంది కైవసం చేసుకున్నారు.